పచ్చదనంతో పరవశం

- ఆహ్లాదం పంచుతున్న పొట్టపెల్లి(కే) పల్లె ప్రకృతి వనం
- అన్ని రకాల మొక్కలతో ఆదర్శం..
- సేదతీరుతున్న గ్రామస్తులు


ఏపుగా పెరిగిన మొక్కలు


పల్లెవనంలో వివిధ రకాల పూలమొక్కలు

లక్ష్మణచాంద: రకరకాల పూలు, పండ్లనిచ్చే మొక్కలతో మండలంలోని పొట్టపెల్లి(కే)లో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతివనం ప్రజలకు ఆహ్లాదం పంచుతోంది. 20 గుంటల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ వనంలో నాటిన మొక్కలను సంరక్షిస్తుండటంతో భూమికి పచ్చని రంగేసినట్లు ఏపుగా పెరిగాయి. ప్రస్తుతం ఎండలు పెరుగుతున్నందున స్థానికులు వచ్చి ఈ వనంలో సేదతీరుతున్నారు. స్వచ్ఛమైన గాలి అందుతుండటంతో ఉదయం, సాయంత్రం వచ్చి మరికొందరు వాకింగ్ చేస్తున్నారు. చిన్నారులు సైతం పచ్చని చెట్ల మధ్య ఆడుకుంటున్నారు.

మండలంలో..

లక్ష్మణచాంద మండలంలోని 18 పంచాయతీలుండగా.. పొట్టపెల్లి(కే)లో పంచాయతీ కార్యాలయం పక్కన ఏర్పాటు చేసిన ప్రకృతివనం మాత్రం ఆదర్శంగా నిలుస్తోంది. పూలు, పండ్లు, నీడనిచ్చే మొక్కలు నాటారు. ఇందులో మందార, గన్నేరు, నిద్రగన్నేరు, పచ్చ గన్నేరు, స్వర్ణ గన్నేరు, టికోమా, పల్చేరిమా, మల్లె, ఉసిరి, దానిమ్మ, అరటి, బాహీనియా, అల్లనేరేడు, శంకు పూలు, బూరుగ వంటి మొక్కలు నాటి సంరక్షిస్తున్నారు.

పలు అవార్డులు

పచ్చదనం, పారిశుద్ధ్యం విభాగంలో పొట్టపెల్లి(కే) గ్రామపంచాయతీ ఇప్పటికే పలు అవార్డులు అందుకుంది. గత మూడేళ్లలో ప్రధానంగా పొట్టపెల్లి(కే).. మూడు సార్లు ఉత్తమ పంచాయతీగా అవార్డు సాధించింది.


ఆకట్టుకుంటున్న మొక్కలు

మొక్కలపై ఇష్టంతోనే..



మొక్కల పెంపకమంటే ఇష్టం. గ్రామంలో హరితహారంలో నాటిన ప్రతి మొక్కను సిబ్బంది సహకారంతో కాపాడేందుకు కృషి చేస్తున్నా. భిన్నంగా ఉండాలనే గ్రామంలోని పల్లె పక్రృతి వనంలో పూలమొక్కలను నాటించా. ప్రస్తుతం వనంలోని మొక్కలు అందరిని ఆకట్టుకుంటున్నాయి.

– శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి

కార్యదర్శి ప్రత్యేక చొరవతో..

పొట్టపెల్లి(కే)లో పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్ తనదైన ముద్ర వేస్తున్నారు. గ్రామంలో హరితహారం మొక్కలతోపాటు పల్లె వనంలో నాటిన మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. నిత్యం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సిబ్బందికి పలు సూచనలు చేస్తూ వాటిని సంరక్షిస్తున్నారు. వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడంతో కొందరు గ్రామస్తులు పచ్చదనం నడుమకు వచ్చి వాకింగ్ చేస్తున్నారు.

ప్రశాంతంగా అన్పిస్తుంది



మా గ్రామంలోని పల్లె ప్రకృతివనం మిగతా గ్రా మాల కంటే బాగుంది. ఇక్కడకు రాగానే మనసుకు ప్రశాంతంగా అన్పిస్తుంది. స్వచ్ఛమైన గాలి లభిస్తుండటంతో మేమంతా నిత్యం ఇక్కడకు వస్తుంటాం.

– సాగర్, పొట్టపెల్లి(కే)

మొక్కలతో ఆహ్లాదం



ప్రకృతివనం మా గ్రామానికి వరంలాంటిది. ఇక్కడ ఏర్పాటు చేసిన ట్రాక్‌లో నిత్యం నడుస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నాం. ఏపుగా పెరిగిన మొక్కలు మాకు ఆహ్లాదం పంచుతున్నాయి. కొందరు చిన్నారులు సైతం వచ్చి ఆటలాడుకుంటున్నారు.

– గంగాధర్, పొట్టపెల్లి(కే)

కరాటేలో విద్యార్థుల ప్రతిభ


బీర్నంది జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులు, టీచర్లు

ఖానాపూర్: మండలంలోని బీర్నంది జడ్పీహెచ్ఎస్‌తోపాటు గోసంపల్లె బ్రిలియంట్ స్కూల్, ఖానాపూర్‌లోని ఏసీఈ స్కూల్, బీర్నంది వాసు విద్యాలయాలకు చెందిన విద్యార్థులు కరాటేలో ప్రతిభ కనబరిచి పలు రకాల బెల్టులు అందుకున్నారని కరాటే మాస్టర్ మచ్చ మనోహర్ తెలిపారు. ఖానాపూర్ పట్టణంలోని బాలాజీ రైస్‌మిల్లు ఆవరణలో ఈ కరాటే శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆరెంజ్, ఎల్లో, గ్రీన్, మెరూన్ బెల్టులతోపాటు ప్రశంసాపత్రం, ఐడీ కార్డులు అందజేశామని పేర్కొన్నారు. బీర్నంది జెడ్పీఎస్ఎస్‌కు చెందిన నాగచైతన్య మెరున్‌బెల్ట్, విశ్వంత్, శివకుమార్, ప్రవళిక, ఆరెంజ్‌బెల్ట్.. బీర్నంది వాసు విద్యాలయం ఎం.అక్షర్ గ్రీన్‌బెల్ట్, గోసంపల్లె బ్రిలియంట్ స్కూల్‌కు చెందిన శ్రావణి, చరణ్‌తేజ్, యుక్తిక, ఆరెంజ్ బెల్ట్, లాస్య, సురక్షిత్, మనిసాకేత్, వరుణ్, ఎల్లో బెల్ట్, ఏసీఈ స్కూల్ కావ్య ఆరెంజ్ బెల్ట్, తేజస్విని ఎల్లో బెల్ట్ సాధించారని పేర్కొన్నారు.

బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం


ఇంటింటి ప్రచారంలో బీజేపీ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: ఆదిలాబాద్ ఎంపీగా బీజేపీ అభ్యర్థి గోడం నగేశ్‌ను గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్ అన్నారు. సోమవారం నిర్మల్ పట్టణంలోని బాగులవాడలో స్థానిక బీజేపీ నాయకులతో కలిసి పార్లమెంట్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు.. బీజేపీపై తప్పులు ప్రచారం చేస్తున్నాయని పేర్కొన్నారు. బీజేపీకి మరో అవకాశమిచ్చి శక్తి సంపన్న దేశంగా తీర్చిదిద్దుకోవాలని అన్నారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అయ్యన్నగారి రాజేందర్, పట్టణ ప్రధాన కార్యదర్శి అల్లం భాస్కర్, రమేశ్, రావుల రాము, పోలింగ్ బూత్ అధ్యక్షులు అల్లం అరుణ్, సాయిరాం పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ప్రచారం


నిర్మల్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు


తానూరు : బెంబరలో ప్రచారం చేస్తున్న రమాదేవి

నిర్మల్‌టౌన్: ఆదిలాబాద్ ఎంపీగా బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కును గెలిపించాలని కోరుతూ సోమవారం జిల్లా కేంద్రంలోని పలు వార్డుల్లో బీఆర్ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మారుగొండ రాము మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. కాంగ్రెస్ పార్టీ వందరోజుల పాలనలో జరిగిన అభివృద్ధి శూన్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నజీరుద్దీన్, లక్ష్మణచారి తదితరులు పాల్గొన్నారు.

తానూరు: ఆదిలాబాద్ ఎంపీగా బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కును గెలిపించాలని మండలంలోని బెంబర, ఝరి(బి), వడ్‌ఝరి(బి) గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు రమాదేవి ఎన్నికల ప్రచారం చేశారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి పనులను వివరించారు. కార్యక్రమంలో సాయినాథ్, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

- మున్సిపల్ వైస్ చైర్మన్ జాబీర్ అహ్మద్


మాట్లాడుతున్న వైస్ చైర్మన్ జాబిర్ అహ్మద్

భైంసాటౌన్: మిషన్ భగీరథ అధికారుల నిర్లక్ష్యంతో 15 రోజులుగా భైంసా పట్టణ ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మున్సిపల్ వైస్ చైర్మన్ అహ్మద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఈ విషయమై మున్సిపల్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమావేశం ఏర్పాటు చేయగా.. ఎన్నికల కోడ్ పేరుతో అధికారులు గైర్హాజయ్యారు. దీంతో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, డీఈఈ సుదర్శన్ రెడ్డి, పబ్లిక్ హెల్త్ విభాగం డీఈఈ సంతోష్, గ్రిడ్ ఈఈ సంపత్, డీఈఈ ఆదిత్యతో కలిసి భైంసా పట్టణంతోపాటు భైంసా, కుంటాల, లోకేశ్వరం మండలాల్లోని పలు గ్రామాలకు తాగునీటి సరఫరాపై చర్చించారు. 15 రోజుల్లోగా నీటి ఎద్దడి సమస్య పరిష్కారానికి నిర్ణయానికొచ్చారు.

ఇష్టారీతిన పనులు..

మున్సిపల్ కార్యాలయంలో వైస్ చైర్మన్ ఎండీ జాబిర్ అహ్మద్ మాట్లాడుతూ గడ్డెన్న వాగు ప్రాజెక్ట్ వద్ద భగీరథ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నుంచి ప్రథమ ప్రాధాన్యతగా పట్టణ ప్రజలకు తాగునీరు అందిస్తున్నారని పేర్కొన్నారు. కానీ కొద్దిరోజులుగా ఇష్టారీతిన నీటిని సరఫరా చేస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. భైంసా మండలంతోపాటు కుంటాల మండలంలోని గ్రామాలకు సైతం ఇక్కడి నుంచే నీటిని సరఫరా చేస్తున్నారని.. ఈ విషయమై తమకు అభ్యంతరం లేదని, అయితే పట్టణ ప్రజలకు ముందుగా నీటిని సరఫరా చేసిన తరువాతే ఇతర ప్రాంతాలకు అందించాలని డిమాండ్ చేశారు. పట్టణంలో మిషన్ భగీరథ పనులు ఇష్టారాజ్యంగా చేశారని, దీంతో సీసీ రోడ్లు, డ్రైయినేజీలపై కల్వర్టులు దెబ్బతిని గుంతల రోడ్లతో ప్రజలు అవస్థలు పడుతున్నారని ఆరోపించారు. ఇంటి లోపలికి నల్లా కనెక్షన్ ఇవ్వాల్సి ఉండగా.. బయట తూతూ మంత్రంగా ఇచ్చి వదిలేశారన్నారు. ఇప్పటికీ కొన్ని ప్రాంతాలకు నీటి సరఫరా కావడం లేదన్నారు. పట్టణంలో 70 వేలకు పైగా జనాభా ఉంటారని.. మిషన్ భగీరథ గ్రిడ్ నుంచి 14 గంటల పాటు నీటిని సరఫరా చేయాలని కోరారు.

ప్రమాదకర గుంతలు పూడ్చివేత

- సేవాభావం చాటిన రాచాపూర్ యువత


గుంత పూడుస్తున్న యువకులు

లక్ష్మణచాంద: మండలంలోని కనకాపూర్–లక్ష్మణచాంద రోడ్డుపై పొట్టపెల్లి(కే) సమీపంలో ఏర్పడిన గుంతలతో ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న రాచాపూర్ గ్రామ యువకులు సోమవారం స్వచ్ఛందంగా ముందుకొచ్చి తమ సొంత ఖర్చులతో సదరు గుంతలను పూడ్చివేశారు. ఇసుక, సిమెంట్, నీళ్లను ట్రాక్టర్‌పై తీసుకెళ్లి ప్రమాదకర గుంతలను పూడ్చివేశారు. కార్యక్రమంలో రాజు, శ్రీకాంత్, మధు, అరుణ్, నితీశ్ ఉన్నారు.

సీఎం సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు


ఖానాపూర్ నుంచి వెళ్తున్న నాయకులు


ఖానాపూర్: ఆదిలాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్న బహిరంగసభకు పట్టణంతోపాటు మండలానికి చెందిన కాంగ్రెస్ శ్రేణులు తరలివెళ్లారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పిలుపు మేరకు మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, పార్టీ మండల, పట్టణాధ్యక్షులు దయానంద్, నిమ్మల రమేశ్ ఆధ్వర్యంలో వాహనాల్లో పెద్ద సంఖ్యలో వెళ్లారు. కావలి సంతోష్, షబ్బీర్‌పాషా, సత్యనారాయణ, గంగాధర్, సత్యనారాయణ, షౌకత్ పాషా, రాజేశ్వర్, మీర్జాబేగ్, వెంకటప్పయ్య, రాజేందర్, తదితరులు ఉన్నారు.

సారంగపూర్: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు సోమవారం ఆదిలాబాద్‌లో నిర్వహించిన జనజాతర సభకు తరలివెళ్లారు. గ్రామాల నాయకులు మండలకేంద్రానికి చేరుకుని ప్రత్యేక వాహనాల్లో ఆదిలాబాద్ చేరుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు నర్సయ్య, సత్యపాల్‌రెడ్డి, నారాయణరెడ్డి, అబ్దుల్ హాదీ, నాయకులు తదితరులు ఉన్నారు.

కొండగట్టుకు స్వాముల పాదయాత్ర

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని రాంనగర్ పంచముఖి హనుమాన్ ఆలయం నుంచి సోమవారం హనుమాన్ దీక్షాపరులు జగిత్యాల జిల్లాలోని కొండగట్టుకు పాదయాత్రగా బయలుదేరారు. అంతకుముందు అర్చకులు అలుగోటు సురేశ్ గురుస్వామి ఆధ్వర్యంలో దీక్షాపరులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

పూర్వ ప్రాథమిక విద్య సద్వినియోగం చేసుకోవాలి


సుర్జాపూర్‌లో పాల్గొన్న చిన్నారులు, సిబ్బంది

ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్, సుర్జాపూర్ ఎస్సీ కాలనీల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత మాట్లాడారు. 5 ఏళ్ల లోపు చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పూర్వప్రాథమిక విద్యను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీచర్లు ఊర్మిళ, సులోచన, సరస్వతి, వైశాలి, రమ ఉన్నారు.

పాఠశాలల్లో వసతుల కల్పనకు కృషి


ఓలాలో పనులు పరిశీలిస్తున్న అధికారులు

కుంటాల: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని ఎంపీడీవో అబ్దుల్ రహీం పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ఓలా ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న తాగునీటి మరమ్మతులు పరిశీలించారు. పాఠశాలల్లో మరుదొడ్లు, మూత్రశాలలు, తాగునీటి వసతి కల్పించాలని ఆదేశించారు. పీఆర్ డీఈ సురేశ్, హెచ్ఎం లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి యోగేశ్ తదితరులు ఉన్నారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషిచేయాలి


పూలమాల వేస్తున్న ఎస్సై, నాయకులు

తానూరు: అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్సై సందీప్ సూచించారు. సోమవారం మండలంలోని హిప్నెల్లిలో అంబేద్కర్ జయంతి నిర్వహించగా.. ఎస్సై పాల్గొని మాట్లాడారు. అంబేద్కర్ అన్ని వర్గాల ప్రజలకు సమాన హక్కులు కల్పించారని పేర్కొన్నారు. అంబేద్కర్‌ను స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత చదవులు చదవాలని యువతకు సూచించారు. అనంతరం నివాళులర్పించి పంచరంగి జెండా ఆవిష్కరించారు. సోన్‌కాంబ్లే సాహెబ్‌రావ్, విజయ్, రామచంద్రే, మాజీ సర్పంచ్‌లు బాబాసాహెబ్, శ్యాంపటేల్, నాయకులు అవినాశ్, భారతీయ బౌద్ధమహాసభ సభ్యులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం


మరమ్మతులు పరిశీలిస్తున్న అధికారులు

కుంటాల: మండలంలోని అంబుగామలో భగీరథ నీళ్లు రాక వారం రోజులుగా జనం ఇబ్బందులు పడుతున్న విషయం తెలిసిందే. మెదన్‌పూర్ శివారులో సంపు వద్ద నీటిని సరఫరా చేసే 40 హెచ్‌పీల, 20 హెచ్‌పీల సామర్థ్యం కల్గిన విద్యుత్ మోటార్లు కాలిపోవడంతో ఈ సమస్య తలెత్తింది. దీంతో అధికారులు తాగునీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయిస్తున్నారు. సోమవారం విద్యుత్ మోటార్లకు మరమ్మతులు చేయించారు. అంబుగామలో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.లక్ష నిధులు మంజూరు చేశామని.. బోరుబావి తవ్వించేలా చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు. మరమ్మతులు పరిశీలించిన వారిలో ఎంపీడీవో అబ్దుల్ రహీం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్, గ్రిడ్ ఏఈ కమల్‌సాయి, కార్యదర్శులు దేవన్న, కై సర్ ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ఖానాపూర్: మండలంలోని సింగాపూర్ గ్రామంలో ఇటీవల పిడుగుపాటుతో మృతి చెందిన లక్ష్మి కుటుంబాన్ని సోమవారం బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్ పరామర్శించారు. అనంతరం రాజురాలో ఇటీవల భీమేశ్ మృతి చెందగా బాధిత కుటుంబీకులను పరామర్శించారు. అంతకుముందు సత్తనపల్లికి చెందిన దామెర నర్సయ్య కుటుంబంతోపాటు మాజీ సర్పంచ్ నాసానిరెడ్డి వేర్వేరుగా పరామర్శించారు. ఈ సందర్భంగా మృతికి కారణాలను తెలుసుకున్నారు.

ప్రారంభమైన వరికోతలు

- రోడ్లపై ధాన్యం కుప్పలు పోస్తున్న రైతులు
- వాహనదారులకు పొంచి ఉన్న ముప్పు


చామన్‌పెల్లి వద్ద రోడ్డుపై ధాన్యం

లక్ష్మణచాంద: మండలంలోని చామన్‌పెల్లి, లక్ష్మణచాంద గ్రామాల్లో సోమవారం రైతులు వరి కోతలు ప్రారంభించారు. దీంతో కోసిన ధాన్యం కుప్పలను అన్నదాతలు ఆయా గ్రామాల సమీపంలోని డబుల్ రోడ్డుపై ఆరబెట్టారు. మరో మూడు, నాలుగు రోజుల్లో కోతలు జోరందుకునే అవకాశం ఉంది. రాకపోకలకు ఇబ్బంది అవుతుందని.. రోడ్ల పై పంటకుప్పలు పోయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

అక్రమంగా మద్యం విక్రయించొద్దు


తనిఖీ చేస్తున్న ఎస్సై రాజు, సిబ్బంది

లోకేశ్వరం: గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని లోకేశ్వరం ఎస్సై రాజు అన్నారు. సోమవారం మండలంలోని పంచగుడి గ్రామ శివారులో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా మద్యం, డబ్బు సరఫరా చేయవద్దని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపేవాళ్లకు పాల్పడినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు పోలీసులు ఉన్నారు.

క్లుప్తంగా

పనులు పరిశీలన

మామడ: మండలంలోని తాండ్ర పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టే అభివృద్ధి పనులను సోమవారం ఎంపీడీవో సుశీల్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా పలు వివరాలు తెలుసుకున్నారు. త్వరగా పనులు ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఇంజినీరింగ్ అధికారులు ఉన్నారు.

పర్యావరణం కాపాడుకోవాలి

మామడ: పర్యావరణాన్ని కాపాడుకుంటూ వాతావరణ సమతుల్యతపై అవగాహన పెంచుకోవాలని డ్రీమ్స్ సొసైటీ కోఆర్డినేటర్ చిన్నయ్య అన్నారు. సోమవారం మండలంలోని చందారం గ్రామంలో అవగాహన కల్పించారు. ఎండిన మొక్కలను కాల్చడం ద్వారా పర్యావరణ కాలుష్యం ఏర్పడుతుందని.. వ్యర్థాలతో కంపోస్టు తయారు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ భారతి గ్రామస్తులు ఉన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఆర్టీసీ అధికారులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని శివాజీచౌక్‌లో రోడ్డు భద్రతపై వాహనదారులకు ఆర్టీసీ అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. ద్విచక్రవాహనాలు నడిపేవారు హెల్మెట్.. కారు నడిపేవారు సీటు బెల్టు ధరించాలని సూచించారు. ఆర్టీసీ గమ్యం యాప్‌ను డౌన్లోడ్ చేసుకుని బస్సులు ఎక్కడ ఉన్నాయో తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు పోశెట్టి, నర్సయ్య ఉన్నారు.

రేపు ద్విచక్ర వాహనాల వేలం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయంలో ఈనెల 24న ద్విచక్ర వాహనాల బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ లక్ష్మణ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలను జిల్లా ఎక్సైజ్ అధికారి ఎండీ రజాక్ ఆదేశాల మేరకు వేలం వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలవారు నిర్మల్ ఎక్సైజ్ స్టేషన్లో సంప్రదించాలని సూచించారు.

మండల సమావేశం వాయిదా


వాయిదా వేస్తున్నట్లు ప్రకటిస్తున్న ఎంపీడీవో

భైంసారూరల్: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన భైంసా మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా వేసినట్లు ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఏడుగురు ఎంపీటీసీ సభ్యులకు గాను ఇద్దరే హాజరు కావడంతో వాయిదా వేశామని.. త్వరలో మళ్లీ సమావేశం నిర్వహించే తేదీని ప్రకటిస్తామని పేర్కొన్నారు.

బాబా ఆలయ వార్షికోత్సవం


హోమంలో పాల్గొన్న భక్తులు

కడెం: మండలకేంద్రంలోని సాయిబాబా ఆలయ 12వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే పూజలు చేశారు. ఆలయ ఆవరణలో హోమం నిర్వహించి.. భక్తులకు తీర్థప్రసాదం అందజేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేశారు.

జాన్సన్‌నాయక్ పూజలు


పూజలు చేస్తున్న జాన్సన్‌నాయక్

ఖానాపూర్: మండలంలోని పాతతర్లపాడ్‌లో ఉన్న శ్రీ గండి రాజేశ్వర ఆలయ వార్షికోత్సవంలో భాగంగా సోమవారం పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. పురోహితులు హరీశ్‌కుమారాచారి, వెంకటాచార్యుల ఆధ్వర్యంలో కుంకుమార్చన, పూర్ణాహుతి, సుదర్శనహోమం, రుద్రహోమం, అన్నపూజ, శిఖర కుంభాభిషేకం నిర్వహించారు. బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్ గ్రామస్తులు హాజరై పూజలు చేశారు.

బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన

ఖానాపూర్: పట్టణంలోని బర్కత్‌పుర అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం కాలనీవాసులకు అంగన్‌వాడీ టీచర్ వరలక్ష్మి బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. నిర్ణీత వయసు రాకుండా వివాహం చేయవద్దన్నారు. ఎవరైనా చైల్డ్ మ్యారేజ్ చేస్తే డయల్ 100తోపాటు 1098, 181 నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు.